— గొల్లపూడి దుర్గావళి

పౌలగ్లాను తీసుకుని బెడ్‌రూంలోకి అడుగు పెట్టింది శ్యామల సూర్యం అసహనంగా అటూ ఇటూ తిరుగుతున్నాడు.

బెడ్‌మీద దుప్పటిని తీసి అవతల పడేసి బీరువాలోంచి తెల్లని మరో దుప్పటిని తీసి మంచం మీద పరుస్తోంది శ్యామల.

ఆమెవంక పరీక్షగా చూసి నిట్టూర్చాడు సూర్యం.

"ఏమటండీ అలా ఉన్నారు?" అంది భర్త వాలకాన్నిచూసి.

"అహ ఏంలేదు. రా ఇలా కూర్చో" అంటూ తన పక్కన చోటు చూపించాడు. కూర్చుంది శ్యామల.



"శ్యామా నేనంటే నీకు చాలా ఇష్టంకదూ," అన్నాడు ఆమెనే పరిశీలనగా చూస్తూ. "అవునండి," అంటూ సిగ్గుపడింది శ్యామల.

"వెరీగుడ్ అయితే నేను ఏం చెయ్యమన్నా చేస్తావా?" అన్నాడు కొంటెదనం నటిస్తూ.

"పోండి చిలిపి మాటలూ మీరూను."

"అలా కాదు నిజంగా చెప్పాలి," అన్నాడు సూర్యం.

"అలాగే మీరు ఏం చెబితే అది చేస్తాను. ఈ మేడ మీదనుంచి క్రిందికి దూకమన్నారా?"

"మేడమీద నుంచి దూకక్కర్లేదు కాళ్ళు విరుగుతాయి. ఏం నిజంగా చేస్తావుకదూ."

"అబ్బ ఇంకా ఏమిటండీ మీ అనుమానం," అంది గోముగా.

"శ్యామా నువ్వు వెంటనే నాకు విడాకులు ఇవ్వాలి," అన్నాడు సూర్యం.

"విడాకులా విస్తరాకులా మీ కొంటె మాటలూ మీరూను," అంది నవ్వేస్తూ.

"లేదు శ్యామా నిజంగానే చెబుతున్నాను. నువ్వు నాకు విడాకులు ఇవ్వాలి," అన్నాడు గంభీరంగా.

"ఏమిటండీ మీ మాటలు నేను విడాకులు ఇవ్వటం ఏమిటి? మీకు మతిగానీ పోయిందా."

శ్యామల ముఖంలో రంగులు మారాయి.

"నామతేం పోలేదు. నాకు పిల్లలు కావాలి అందుకే మరో పెళ్ళి చేసుకుందాం అనుకుంటున్నాను."

"ఏమిటండీ మీ మాటలు అప్పుడే మనకు ఏ. మంత

వయసు మించి పోయిందని పిల్లలు కలగరని నిర్ణయించుకున్నారు," అంది గద్గద స్వరంతో.

"శ్యామా మొన్న మనం డాక్టరు దగ్గరకు వెళ్ళాం గుర్తుందా. ఆ మర్నాడే తెలిసింది ఇంక నీకు పిల్లలు పుట్టే అవకాశం లేదని. అందుకే నేను మరో పెళ్ళి చేసుకుంటాను."

"నిజమా! ఆ డాక్టరు అలా చెప్పిందా? నేను నమ్మను మీరేదో దాస్తున్నారు. అలా అయితే ఈ విషయం అప్పుడే ఎందుకు చెప్పలేదు," అంది వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ.

"నువ్వు బాధ పడతావని వెంటనే చెప్పలేదు."

"బాధ... ఈ బాధ కంటే ఎక్కువా అది. ఏవండీ నేను చదువురాని దాన్ని నాకు మీరు అత్తయ్య తప్ప నా అన్నవాళ్ళెవరూ లేనిదాన్ని నన్ను అన్యాయం చెయ్యకండి." అంటూ అతని కాళ్ళు పట్టుకుని భోరున విలపించింది శ్యామల.

"చూడు విడాకులు ఇచ్చి నీకేం అన్యాయం చెయ్యను. ఈ మేడ, పాతికవేలు రొక్కం నాపేర పెడతాను, హాయిగా బ్రతుకు. కానీ నాకు విడాకులు మాత్రం ఇయ్యి అంతేచాలు. నాబాధని అర్థం చేసుకో శ్యామా," అన్నాడు జాలి గొలిపేలా.

వెక్కి వెక్కి ఏడువటం తప్ప ఏం మాట్లాడలేక పోయింది శ్యామల.

* * *

"ఏమిటీ శ్యామల అలా ఉన్నావు వంట్లో కానీ బావుండలేదా," అంది సుగుణమ్మ.

"ఏంలేదు అత్తయ్య బాగానే ఉన్నాను," అంది ముఖంమరో వైపు తిప్పుకుంటూ. వంట చేసే హడావుడిలో కోడల్ని అంతగా పట్టించుకోలేదు సుగుణమ్మ.

భార్యని మరోసారి హెచ్చరించి కాలేజికి వెళ్ళి పోయాడు సూర్యం. దిండులో తలదాచుకుని తన బాధను కన్నీటి రూపంలో బైటికి వెళ్ళగ్రక్కు కుంటోంది శ్యామల.

"శ్యామలా... శ్యామల," అనే అత్తగారి పిలుపు ఆమె చెవులకు వినిపించలేదు.

భర్త విడాకులు ఇమ్మంటున్నాడు. తన కింక ఏందారి? ఏం చూసుకుని బ్రతకటం. తనకంటూ తల్లి తండ్రిలేరు. ఉన్న మేనమామ ఎలాగో చివాట్లతో చీదరింపులతో పెంచిపెద్ద చేశాడు. అత్తగారి దొడ్డ మనసు వల్ల కానీకట్నం లేకుండా పెళ్ళి చేసి చేతులు దులుపు కున్నాడు. అనాధగా పెరిగిన తనకు ఏమూలో ఉన్న అదృష్టం వెన్ను తట్టగా బంగారం లాంటి భర్త, తల్లి కంటే మిన్నగా చూసుకునే అత్తగారి అండదండలు లభించాయి. జీవితం మూడుపూలు, ఆరు కాయలుగా సాగి పోతుంటే మళ్ళీ ఎదురు దెబ్బ తగిలింది. భర్తకు విడాకులు ఇచ్చి జీవచ్ఛవంలా ఎలా బ్రతకటం.

వెక్కి వెక్కి ఏడుస్తోంది శ్యామల.

కోడలు ఎన్నిసార్లు పిలిచినా క్రిందకి రాకపోవటంతో తనే పైకి వచ్చిన సుగుణమ్మ కోడల్ని ఆస్థితిలో చూసి నిర్ఘాంతపోయింది.

"శ్యామలా ఏమిటమ్మా ఏంజరిగింది? ఎందుకలా ఏడుస్తున్నావు? అందిఖంగారుగా అత్తగారి మాటల్లోని ఆప్యాయతకు కరిగిపోయింది శ్యామల.

"అత్తయ్యా" అంటూ వచ్చి ఆమెను కౌగలించుకుని ఘొల్లుమంది.

కోడల్ని ఊరడించి అసలు విషయం విన్న సుగుణమ్మ శిలాసదృశ్యంగా మిగిలి పోయింది.

ఆవిడ ఈమధ్య కొడుకు వైఖరిని గమనించక పోలేదు.

కాలేజీలో చదువుకునే ఆడపిల్లలు ట్యూషన్‌కి ఇంటికి రావటం, వాళ్ళతో కొడుకు వకవకల్లు వికవికలు, కొంటెమాటలు, అతిచనువు తనుచూసినా వయసు వచ్చిన కొడుక్కి ఏం చెప్పగలదు, ఏమని మందలించగలదు. చదువుకోని శ్యామలకు ఇవేం తెలియవు. ఒకటి రెండు సార్లు ట్యూషన్ టైమ్‌లో పైకి వెళ్ళిన శ్యామల ఇలా మాటి మాటికి పైకి వచ్చి వాళ్ళ చదువుకి అంతరాయం కల్గించద్దని సూర్యం అనటంతో కిందనే ఉండసాగింది. దాంతో వాళ్ళకి మరింత స్వేచ్ఛదొరికింది.

"ఏడవకు శ్యామలా అసలు విషయం నేను కనుక్కుంటానుగా," అంటూ ఓదార్చింది కోడలిని.

అత్తగారి మాటలతో తాత్కాలికంగా ఓదార్పులభించినా శ్యామల అంతరంగం అల్లకల్లోలంగా ఉండిపోయింది.



## తెలిసొస్తుంది !

"నాన్నా....నాన్నా రాజావన్నీ సిల్లీ ఐడియాలే. 'స్వర్గం వుందంటే నమ్ముతాను; కానీ నరకం వున్నదంటే నమ్మను' అని అంటున్నాడు." అంది రాణి, తండ్రితో.

"అతన్ని పెళ్ళి చేసుకో తల్లీ .... అప్పుడతనికి తెలుసొస్తుంది."

"సూర్యం ఓసారి ఇలారా నీతో మాట్లాడాలి," భోంచేసి పైకి వెడుతున్న కొడుకుని పిలిచింది సుగుణమ్మ.

"ఏమిటమ్మా?"

"అలా కూర్చో"

కూర్చున్నాడు సూర్యం.

"ఏవిట్రా నువ్వు మళ్లీ పెళ్ళి చేసుకుంటానని శ్యామలని విడాకులు ఇమ్మని అడిగావట," అంది.

"అవును అడిగాను," అన్నాడు ధైర్యంగా.

అసమాధానానికి విస్తుపోయింది సుగుణమ్మ. చిన్నప్పుడే భర్తపోతే ఇంత నలుసుని పెంచి పెద్ద చేసింది తను. నిన్న మొన్నటి దాకా తనకొంగు పట్టుకుని తిరిగి తన ఇష్టప్రకారం శ్యామల మెళ్ళో మూడు ముళ్లూ వేసింది వీడేనా అన్పించింది ఆవిడకి.

"అదే ఎందుకు అని అడుగుతున్నాను?"

"అమ్మ నాకు వంశం కోసం పిల్లలు కావాలి. శ్యామలను డాక్టరుకు చూపిస్తే ఇంక పిల్లల పుట్టరని ఖచ్చితంగా చెప్పేసింది. అందుకే నేను విడాకులు తీసుకుని మళ్ళీ పెళ్ళి చేసుకుంటాను."

"వంశం.... నిజంగా నువ్వువంశం కోసం పాకులాడితే ఎవరినైనా పెంచుకో వచ్చుగా?"

"వాళ్ళు నా పిల్లలు ఎలా అవుతారమ్మా. ఎంతైనా కన్నపిల్లలు కారుగా."

"సూర్యం! శ్యామలనీ దాని అమాయకత్వాన్ని చూస్తుంటే దానికి అన్యాయం చేసి పోవాలనే తలపు ఎలా కలుగుతోందిరా?" అంది ఆవేదనగా.

"అమ్మా నేను శ్యామలకి అన్యాయం చేస్తానని ఎలా అనుకుంటున్నావు. నేను అంత ఆలోచన లేని మూర్ఖుడినా. ఈఇల్లు, పాతికవేలు తన పేర రాస్తాను."

"హు. ఈ ఇల్లు ఆడబ్బు మీ నాన్నగారు సంపాదించినవేరా. అయినా ఆడదాని బ్రతుక్కి కావల్సింది డబ్బు ఇల్లు కాదురా భర్త. నీ చేత మూడు ముళ్ళు వేయించుకుని, నీ కష్టసుఖాలలో పాలు పంచుకుంటానని నీ చేయి పట్టుకుని ఈ ఇంట్లో అడుగు పెట్టి, ఈ ఇంటికి దీపమైన ఇల్లాలిని నట్టేట ముంచకు సూర్యం."

"అమ్మా ఇలాంటి మాటలు చెప్పి నా మనసు మార్చాలని ప్రయత్నించకు నేను తీసుకున్న నిర్ణయాన్ని ఎవ్వరూ మార్చలేరు," అన్నాడు స్థిరంగా

"సూర్యం మరోసారి ఆలోచించు పిల్లలు కలగని ఆ లోపం నీలోనే ఉంటే శ్యామల నిన్నిలాగే వదలిపెట్టి మరో పెళ్ళి చేసుకునేదా?"

"అమ్మా" ఆడదానికి ఒకడే భర్త. కాని మగాడికి అలాకాదు ఓ భార్యద్వారా సంతానం కలగక పోతే మరో పెళ్ళి చేసుకుని సంతానాన్ని పొందటం చూశాంకానీ, పిల్లలకోసం ఆడది ఓ భర్తను కాదని మరో భర్తని చేసుకోవటం ఎక్కడా వినలేదు. అందుకని నేను చేసేపని విడ్డూరం ఏంకాదు."

కోపం ముంచుకు వచ్చింది సుగుణమ్మకి.

"సూర్యం నిన్ను కన్న తల్లిగా అడుగుతున్నాను మరోసారి ఆలోచించి చూడు."

"అమ్మా నేను నీ కన్న కొడుకుని. నాకు వ్యతిరేకంగా కోడలి పక్షం మాట్లాడటం నాకేం నచ్చలేదు," కోపంగానే అన్నాడు సూర్యం.

"నేను న్యాయం మాట్లాడు తున్నానురా. ఓ ఆడదానిగా శ్యామల బాధని అర్థం చేసుకుని మాట్లాడు తున్నాను."

"ఎవరు ఏం మాట్లాడినా నా నిర్ణయంలో మార్పులేదు," అంటూ చివాలున లేచి వెళ్ళి పోయాడు సూర్యం.

కొడుకు అలా వెళ్ళి పోవటంతో తన అహందెబ్బతిన్నట్లు అయింది సుగుణమ్మకి.

* * *

సుగుణమ్మ ఎంత వాదించినా ప్రయోజనం లేక పోయింది

శ్యామల అమాయకత్వం ఆదుఃఖం అతని మనసుని కరగించలేక పోయాయి.

"శ్యామల ఆకాగితం మీద సంతకం చేసి వాడి ముఖాన్న

పారేయమ్మా" అంది గంభీరంగా సుగుణమ్మ.

"అత్తయ్యా" అంటూ రోదిస్తున్న కోడలి దుఃఖాన్ని చూడలేక అక్కడినుంచి వెళ్ళిపోయింది ఆవిడ.

* * *

ఓమూల కూర్చుని కుమిలి కుమిలి ఏడుస్తోంది శ్యామల.

"శ్యామలా... ఇదిగో ఇల్లు నీ పేర ట్రన్స్‌ఫర్ చేయించిన కాగితాలు. బేంకిలో నీ పేరున పాతిక వేలు డిపాజిట్ చేసిన పాస్‌బుక్. ఇంకనన్ను మర్చిపో," అంటూ వాటిని టేబుల్ మీద పెట్టాడు సూర్యం.

తల్లి ఎంతకీ రాక పోవటం గమనించి ఆమె గదివైపు నడిచాడు. "అమ్మారా వెడదాం సామాన్లు అన్నీ సర్దావా?" అంటూ తల్లి గదిలోకి అడుగు పెట్ట పోయిన సూర్యం ఆవిడ ఉగ్రరూపం చూసి వెనక్కిజంకాడు.

"పోరాపో దానికి ఏక్షణంలో అయితే విడాకులు ఇచ్చావో అక్షణం నుంచే నీకూ నాకు ఏ సంబంధం లేదు. నువ్వు చచ్చిపోయావు అనుకుంటాను. ఈ రోజు ఈ ఇంట్లోంచి శాశ్వతంగా కదులు తున్నది నువ్వు కాదురా నీ శవం," అంది కాళికలా గర్జిస్తూ. "అమ్మా" కోపంగా అరిచాడు సూర్యం.

"ఇప్పుడు నేను నీకు అమ్మను కానురా. నువ్వు దిక్కులే కుండా చేసిపోతున్న శ్యామలకు తల్లిని. ఒరేయ్ ఓ అమాయకు రాలి గుండెలు బ్రద్దలు చేసి దాని ఉసురుపోసుకుని నువ్వేం సుఖపడతావో నేనూ చూస్తాను గుండె మండిన ఓ తల్లిగా నిన్ను శపిస్తున్నానురా, ఏదో ఓనాటికి చపల చిత్తుడవైన నువ్వు శ్యామల కాళ్ళు పట్టుకునే స్థితికి చేరుకుంటావు. కానీ మనసు విరిగిన అది నిన్ను ముష్టివాడిగానే చూస్తుందిరా. మాణి క్యంలాంటి భార్యను కాదని ఏమసి బొగ్గుల కోసం పాకులాడు తున్నావో అవే నీ పతనానికి కారణం అవుతాయి అన్న సంగతి గుర్తుంచుకో," అంది ఆవేశంగా.

"అమ్మా నాతో రాకపోతే దానితోనే ఊరేగు. కన్న కొడుకు కంటే మధ్యన వచ్చినదే ఎక్కువైంది నీకు."

"మళ్ళీ అమ్మా అన్నావంటే నీ నాలుక చీరేస్తాను. నీ మొహం నాకు చూపించకపో అవతలికి." అంటూ భళ్ళున తలుపులు మూసుకుంది సుగుణమ్మ.

కోపంతో గిరుక్కున వెను తిరిగి పోయాడు సూర్యం.

* * *


"శ్యామలా" వెర్రికేక పెట్టింది సుగుణమ్మ.

"ఉరిపోసుకుని ముప్ఫైనిండని నీ జీవితానికి అప్పుడే నూరేళ్ళూ నిండిపోయాయి అనుకుంటున్నావా శ్యామలా. లేద మ్మా లేదు నీకు ముందు చాలా జీవితం ఉందమ్మా."

"అత్తయ్యా. ఇంకా ఏం మిగిలిందని బ్రతకాలి. ఎవరికోసం బ్రతకాలి," అంది ఏడుస్తూ. "నాకోసం బ్రతకాలమ్మా నీ భవిష్యత్తుకోసం బ్రతకాలి శ్యామల. మోడు బారిన చెట్టు చిగురించకుండా అలాగే ఉండదమ్మా. నీ కోసం నేను అన్నీ. వదులు కున్నాను, నాకోసం నువ్వు బ్రతుకమ్మా నీ జీవితం అంధకార బంధురం కానివ్వను శ్యామలా. చెదరిన నీ జీవితం చిగురించి వచ్చని పూలు పూయాలి. నీ జీవితానికి కొత్తపునాది వేయాలని నాకోరిక తల్లీ."

"అత్తయ్యా కట్నం కోసం కొడుకుల్ని అమ్ముకుని అది చాలక కోడళ్ళని అగ్నికి ఆహుతి చేసే ఈ రోజుల్లో కానీకట్నం ఆశించకుండా నన్ను మీ ఇంటి కోడల్ని చేసుకున్నారు, కన్న కూతురి కంటే మిన్నగా ఆదరించారు. నాకోసం కన్న కొడుకుని కూడా దూరం చేసుకుని చరిత్రలో ఏతల్లీ చెయ్యని త్యాగం చేశారు... మీరు... మీరునాకు అత్తగారు కాదు నాపాలిటి దేవత," అంటూ అత్తగారి పాదాలు పట్టుకుంది శ్యామల.

"పిచ్చి శ్యామల, లేమ్మా. నేనూమామూలు ఆడదాన్నే కాకపో తే తల్లి మనసు ఉన్నదాన్ని, అంతే తల్లీ... ఇక నుంచీ నేను నీకు అత్తను అన్నమాట మర్చిపో. నేను నీకు కన్న తల్లినే అనుకో అదే నాకు కావల్సింది," అంటూ శ్యామలను దగ్గరకు తీసుకుని ఆమె తలనిమిరింది సుగుణమ్మ.



అందరి చూపులూ.....!

"మీ ఆఫీసుకు మీరు తీసుకోబోయే పాలసీలో ఫర్నీచర్ అంతా కూడా భీమా చేస్తున్నారు కదూ" అని అడిగాడు భీమా ఏజెంటు ఆ సంస్థ యజమానిని.

"ఆఁ .... అన్నీ .... ఆ ఒక్క గోడ గడి యారం తప్ప."

"ఎందుచేత?"

"అందరి చూపు...ా దాని మీదే వుంటాయి కాబట్టి దానికి పాలసీ అవసరం లేదు."

టీచర్ని పెట్టి శ్యామలకు ఇం... ...స్తోంది సుగుణమ్మ.

టీచరుతో ముందుగానే చెపి... ...ా పిల్ల చదివి ఎమ్మే లు, బియ్యేలు పాస్ కానక్కర్లేదు ...ర్థంచేసుకునే జ్ఞానం ఉంటేచాలు" అని.

"శ్యామలా గతాన్ని మరిచిపో. నీకు అసలు వివాహం కాలేదు అనుకోమ్మా జరిగిందంతా ఓ పీడకలలా భావించు నీదృష్టిని చదువు మీదకి మళ్ళించు. జీవితం మీద ఉత్సాహాన్ని పెంచు కో. కాలమే నీ బ్రతుకుని ఓ గట్టుకి చేర్చాలి తల్లీ," అనేది ప్రేమగా.

ఓ సాయంత్రం సుగుణమ్మ అక్కకొడుకు సుదర్శనం వచ్చాడు.

"ఏరా అబ్బాయి ఎన్నేళ్ళకి చూశానో నిన్ను మీ అమ్మపోయాక మన రెండిళ్ళ మధ్యారాక పోకలే తగ్గి పోయాయి. మీనాన్న పిన్ని అంతా బావున్నారా?" అంది అప్యాయంగా.

"మనం కల్సుకుని ఎనిమిదేళ్ళు అయింది పిన్నీ. నాన్న పోయారు. పిన్ని ప్రస్తుతం తమ్ముడి దగ్గర ఉంటోంది," అన్నాడు సుదర్శనం.

"ఏరా పెళ్ళి చేసుకున్నావా ఎంత మంది పిల్లలు?"

సుదర్శనం మొహం మ్లానమయింది ఒక్కసారి. ఏం చెప్పలే కపోయాడు.

"ఏం నాయనా అలా అయి పోయావు ఏం జరిగింది!" అంది ఆతృతగా. "పెళ్ళి అయింది. ఆరునెలల క్రితం పిల్లాడినికని జానకి చనిపోయింది. అప్పటినుంచీ వాడిని పెంచటం ఓ సమస్య అయిపోయింది పిన్నీ" అన్నాడు బాధగా.

"అయ్యో! ఎంతపని జరిగిందిరా సుదర్శనం. అప్పుడే జీవితంలో అన్నీ అయిపోయాయా. కొందరి జీవితాలు అంతే నాయనా. ఏం చేస్తాం ఖర్మ అయితే పిల్లాడు ఎక్కడున్నాడో?"

"నాకు ఈ వూరు బదిలీ అయింది పిన్నీ రేపేజాయిన్ అవ్వాలి పిల్లాడిని నాతోనే ఉంచుకున్నాను."

"అయితే మళ్ళీ పెళ్ళి చేసుకోక పోయావా కనీసం వాడిని చూసేందుకు అయినా మనిషి కావాలిగా," అంది సుదర్శనం పరిస్థితికి జాలిపడుతూ.

"ఎటూ తేల్చుకో లేక పోతున్నాను పిన్ని. అటుజానకిని మర్చిపోలేను. ఇటు మళ్ళీ పెళ్ళి చేసుకుని బాబుకి అన్యాయం చెయ్యలేను," అన్నాడు బాధగా.

అతడి పరిస్థితికి నిట్టూర్పటం తప్ప ఏం చేయలేక పోయింది సుగుణమ్మ.

కాసేపు పిచ్చా పాటీ మాట్లాడు కున్నాక వెడతానన్నాడు సుదర్శనం. పిల్లాడిని తీసుకుని అక్కడికే రమ్మంది సుగుణమ్మ.

* * *

అటు చదువుతో ఇటు సుదర్శనం బాబుతో బాగానే పొద్దు పోతోంది శ్యామలకు.

పెద్ద వయసులో సుగుణమ్మ బాబు పనులు చెయ్యలేక పోవటంతో శ్యామలే అన్ని పనులూ చూసుకుంటోంది.

బాబు ముద్దు మురిపాలతో మురిసి పోతున్న ఆమెకి క్షణంతీరటంలేదు. వాడు క్రమేపీ శ్యామలకి బాగా మాలిమి అయిపోయాడు. "అద సుదర్శనం జరిగిన విషయం," అంటూ విషయం అంతా వివరించింది సుగుణమ్మ.

"ఏమైనా సూర్యం చేసిన పని ఏం బావుండలేదు పిన్ని"

"ఆ విషయమే నేను నెత్తీనోరు బాదుకుని చెప్పాను వింటేనా మూర్ఖుడు," అంది బాధపడుతూ.

అయితే కోడలి విషయం ఏంచేద్దాం అనుకుంటున్నావు పిన్నీ"

"శ్యామలకి మళ్ళీ పెళ్ళి చేద్దా మనుకుంటున్నాను సుదర్శం. దాని విషయం చెప్పి అందుకు ఇష్ట పడ్డ వాడికే ఇచ్చి చేస్తాను."

"చాలా మంచి నిర్ణయం తీసుకున్నాను పిన్నీ కానీ అబ్బా యిని గురించి బాగా విచారించి మరీ చెయ్యి."

"అలాంటి అబ్బాయి దొరకటం అంటే మాటలు కాదు సుదర్శనం. అందుకే శ్యామలని చేసుకోమని నిన్ను అర్థిస్తున్నా ను. నీకంటే బుద్ధిమంతుడు, గుణవంతుడు మరెవరూ

ఉందరు."

"నేనా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును సుదర్శనం. నువ్వేదాని జీవితాన్ని చిగురింప చేయగలవు. రెండూ దెబ్బ తిన్న హృదయాలే కనుక ఒకరిని మరొకరు బాగా అర్థం చేసుకోగలరు. మీమధ్య అపార్థాలకు తావు లేదు. శ్యామల నా కోడలు అన్న అనుమానమే పెట్టుకోకు సుదర్శనం. ఓ అభాగ్యురాలి వైపు నిలబడి ఆలోచించు," అంది సుగుణమ్మ ఆశగా.

ఏం బదులు చెప్పలేదు సుదర్శనం.

"ఓసారి వివాహం అయిందని సందేహిస్తున్నావు కదూ దానికింక పిల్లలు పుట్టే అవకాశమే లేదనివాడు చెప్పాడు. నీకు ఎటూ ఓమగనలును ఉన్నాడు. వాడు దానికి బాగా చేరిక అయ్యాడు. తల్లిలేనిలోటు వాడికీ, బిడ్డలు లేని కొరత శ్యామలకీ లేకుండా చెయ్యి సుదర్శనం."

"పిన్నీ నీలాంటి అత్తలంతా కోడళ్ల పట్ల సహృదయంతో ఆలోచిస్తే ఇంక దేశంలో కోడళ్ళని బాధించే అత్తలే ఉండరు. శ్యామల ఏజన్మలోనో అదృష్టం చేసుకుంది కనకే నీ అండ దొరికింది పిన్నీ" అన్నాడు ఆవిడవైపు ఆపేక్షగా చూస్తూ.

"అయితే ఈ వివాహానికి ఒప్పుకుంటున్నావా సుదర్శనం."

"ముందు శ్యామలని అడిగిచూడు పిన్నీ" అన్నాడు. "హమ్మయ్య! ఇంక దాన్ని నేను ఒప్పించటం దేనికీ కనని పేగు పాశమే దాన్ని ఒప్పిస్తుంది," అంది తృప్తిగా.

మరో నెల్లాళ్ళల్లోనే శ్యామలకీ, సుదర్శనానికి పెళ్ళి జరిగిపోయింది.

సుగుణమ్మ మనను ఆనందాబుధిలో ఓలలాడింది. ఆవిడ చేసిన పనికిహర్షించిన వారు కొందరైతే, ముక్కునవేలు వేసుకున్న వారు మరికొందరు.

• • •

"పిన్నీ ఈ విషయం విన్నావా. మన సూర్యం ఒకాలేజీ స్టూడెంట్‌ని రిజిష్టర్ మేరేజ్ చేసుకుని మద్రాసులో ఉంటున్నాట్ట. ఆస్తిపాస్తులు అన్నీ అమ్మిడబ్బంతా ఆపిల్లపేర వేశాట్ట. ఆతర్వాత ఆ అమ్మాయి వేరే అతనితో తిరగటం చూసి మందలించాడట అయినా వీడి మాటలు వినకపోవటంతో ఓ రోజు మాటా మాటా పెరిగిన కోపంలో ఆ పిల్లని మేడ మీద నుంచి కిందకి తోశాట్ట. ఆ అమ్మాయి వీడినీ కిందకిలాగటంతో ఇద్దరూ క్రింద పడిపోయారుట. ఆ పిల్ల చనిపోయి, మనవాడు కాలు విరిగి ప్రస్తుతం జైల్లో ఉన్నాట్ట," అన్నాడు సుదర్శనం.

"బాగా అయింది. కన్నూ మిన్నూకానని ఆవేశంలో నిర్ణయాలు తీసుకుంటే ఫలితం ఇలాగే ఉంటుంది," అంది నిర్వికారంగా సుగుణమ్మ.

"ఓ సారి వెళ్ళి చూసి వద్దామా పిన్నీ"

"వద్దు. వాడు చేసిన పాపానికి ఫలితం అనుభవిస్తున్నాడు. ఆ.... అన్నట్టు సుదర్శనం ఈ విషయం పొరపాటునైనా శ్యామలతో అనకు సుమా పాపం పిచ్చి పిల్ల బాధ పడుతుంది."

"అలాగే పిన్నీ" అన్నాడు సుదర్శనం.

"అమ్మగారు... చిన్నమ్మగారు ఉదయం నుంచీ వాంతులు చేసుకుంటున్నారమ్మా" అందిపని పిల్ల.

"ఏమిటోరా నిన్న రాత్రి నుంచీ ఇదీ వరస. నీకు ఆఫీసుటైం అయిందిగా భోంచేసి వెళ్ళు. నేను దాన్ని హాస్పటల్‌కి తీసుకు వెడుతాను. అసలే శ్రావణమాసం కొత్తనీరు. ఊళ్ళో కలరా ఉందని చెప్పు కుంటున్నారు," అంటూ ఖంగారుగా కోడల్ని తీసుకుని హాస్పటల్‌కు వెళ్ళింది.

డాక్టరు చెప్పిన వార్త వినగానే ఆమెగుండె ఒక్కసారి ఆగినట్లయింది.

"నిజంగానే?" అంది ఇంకా అనుమానంగా.

"నిజంగానే ఆమె గర్భవతి నాల్గవమాసం" అంది డాక్టరు.

"డాక్టరుగారూ నిజంగా నిజంగా మా అమ్మాయికి పిల్లలు పుట్టే అవకాశం ఉందంటారా?" అంది మళ్ళీ.

"నాల్గవ మాసం అంటూంటే పిల్లలు పుట్టే అవకాశం ఉందంటారా? అలాంటి అవకాశంలేదని మీకు ఎవరు చెప్పారు?" అంది కోపంగా చూస్తూ.

సుదర్శనానికీ, సుగుణమ్మకీ ఆనందానికి అవధులు లేవు. కొడుకు అబద్ధంచెబితే అదే నిజమని నమ్మి కృంగిపోయింది. ఇవాళ తను నమ్మిన ఆ నిజం అబద్ధం అని తెల్సి పొంగిపోతోంది.

తనకే నిజంగా మనవడు పుట్ట బోతున్నంత ఆనందం కల్గింది.

శ్యామలని శ్రద్ధగా కంటికి రెప్పలు చూడ సాగింది. శ్యామలకి ఆవిడలో చిన్న నాడు చనిపోయిన తల్లి కన్పించేది.

తొమ్మిదో నెల రాగానే మగ బిడ్డని ప్రసవించింది శ్యామల. పైకి చెప్పకపోయినా పిన తల్లి అంతర్యం గ్రహించిన సుదర్శనం పిల్లవాడికి పిన తండ్రి పేరు పెట్టాడు.

కాలక్రమంలో మరి ఇద్దరు బిడ్డలకు తల్లి అయింది శ్యామల. మరో ఏడాది తర్వాత ఈ జన్మకి అదృష్టంచాలు అనుకుంటూ గోడమీద ఫోటోలో శాశ్వత స్థానం సంపాదించుకుంది సుగుణమ్మ.

• • •

ఇరవైరెండు వసంతాల్ని కాలం కడుపులో దాచుకుంది.

సుదర్శనం ఇప్పుడు బేంక్ ఏజంట్ అయ్యాడు. పిల్లలు కొందరు డిగ్రీల్లోనూ, మరి కొందరు పి.జీల్లోనూ ఉన్నారు.

ఇంట్లో వాళ్ళకీ బైట వాళ్ళకీ తలలో నాలుకలా మెదిలే శ్యామల ఉత్తమ గృహిణిగా పేరు సంపాదించుకుంది.

పచ్చని దేహచ్ఛాయతో, పట్టుచీరతో ఒంటినిండా ఆభరణాలతో దీపంలా వెల్గిపోయే శ్యామలని అంతా 'లక్ష్మీ దేవమ్మ తల్లి' అని మెచ్చుకుంటారు.

ఆ రోజు సుదర్శనం పుట్టిన రోజు కావటంతో శ్యామలా పిల్లలు అతనితో కల్సిగుడికి వెళ్ళారు. అర్చనలువగైరాలు చేయించిన తర్వాత అటునుంచి అటే ఆఫీసుకి వెడతాను అన్నాడు.

"మధ్యాహ్నం భోజనానికి ఇంటికిరండి. మీ పుట్టిన రోజు అని మర్చిపోయేరు సుమా," అంటూ మరోమారు హెచ్చరించింది. శ్యామల.

కారులో ఇంటికి బైలు దేరారు శ్యామలా పిల్లలు. గేటు దగ్గర వాచ్‌మెన్ ఎవరితోనో గొడవపడుతున్నాడు. కారు లోపలికి వెళ్ళగానే పిల్లలు దిగి వెళ్ళి పోయారు.

ఓసారి వెను తిరిగి చూసింది శ్యామల. గుబురుగా పెరిగిన తల, పొడుగు పాటి గడ్డం, లోతుకు పోయిన కళ్ళు, మురికి గుడ్డలు కర్రసాయంతో నడిచే కుంటి కాలు. ఏమిటో అంటున్నాడు.

"వాచ్‌మెన్ ఏమిటి గొడవ?" అందిగేటు వైపు నడుస్తూ. "సూడండమ్మా ఈ డెవడో ముష్టివాడు లోపలికి పోతాడంట," అన్నాడు వాచ్‌మెన్.

"నేను.. నేను ఈ ఇంటికి," అని ఏదో అనబోతున్న అతని మాటల్ని మధ్యలోనే ఆపి...

"చూడు అబ్బీ, నువ్వు ఇది వరకు ఈ ఇంటికి ముష్టికి వస్తే రావచ్చు నీకు ఇప్పుడు పెట్టటానికి ఇంట్లో ఏం లేదు. ఈ రెండు రూపాయలు తీసుకుని ఏదైనా కొనుక్కుతిను వెళ్ళు," అంటూ వెను తిరిగింది.

తనని భర్తగా గుర్తించ లేక వెను తిరిగి వెళ్ళి పోతున్న శ్యామలని విర్విణ్ణుడై అలాగే చూస్తూ ఉండి పోయాడు కుంటి బిచ్చగాడి రూపంలో ఉన్న సూర్యం.

"ఎళ్ళు ఇంకా నిలబడ్డావే. మామాటంటే ఇనిపించుకోలేదు. ఏజంటుగోరి బారియా, మా అమ్మగోరు సెప్పినా ఇంకా సెవికెక్కలేదా!" అన్నాడు వాచ్‌మెన్.

ఆమె ఇచ్చిన రెండురూపాయల్ని గుప్పిటలో బిగించి పట్టుకుని కన్నీటితో తల్లి మాటల్ని గుర్తు తెచ్చుకుని భారంగా నడుచుకుంటూ ముందుకు సాగాడు సుర్యం. ■



## ప్రేమజ్యోతి

లేమ మనసు చమురు కాగ,
లేత వయసు వత్తి కాగ,
చెలి, హృదయపు ప్రమిదయందు
వెలిగించెను ప్రేమజ్యోతి.
ప్రియుని హృదయ ప్రాంగణమున,
దీపావళి దీపజ్యోతి!
చిరుగాలికి ఆడకుండ,
పెనుగాలికి ఆరకుండ,
కంటిధార నణగకుండ,
కలకాలం వెలుగుగాక!

—గౌరి